క్లుప్తంగా

బూరుగడ్డ ఆలయంలో సహస్రనామ కుంకుమార్చన



గోమాత పూజలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి ఆలయంలో శుక్రవారం సహస్రనామ కుంకుమార్చనను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, బాలభోగం, సేవాకాలం, స్వామివార్లకు పంచామృతాలతో అభిషేకం, మంగళాశాసనం, ఆరగింపు, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం గోమాతకు పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు ముడుంబై హరీష్‌కుమార్‌చార్యులు, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలి



బ్యాడ్జీల ప్రదానంలో ఎస్‌ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్ : విద్యార్థులు జాతీయ భావాన్ని పెంపొందించుకోవాలని ఎస్‌ఐ ముత్తయ్య అన్నారు. హుజూర్‌నగర్‌లోని పెరల్ ఇన్ఫినిటీ స్కూల్‌లో నిర్వహించిన ఎన్నికలో గెలుపొందిన విద్యార్థులకు శుక్రవారం పాఠశాలలో ఆయన బ్యాడ్జీలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ప్రకాష్, ప్రిన్సి పాల్ మురుగన్, అడ్మిన్ టీం కోటేశ్వరరావు, మౌనిక, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు తనిఖీ



అంగన్ వాడీ కేంద్రంలో రికార్డులు తనిఖీ చేస్తున్న మండల ప్రత్యేక అధికారి సంధ్యారాణి

మఠంపల్లి : మండలంలోని బక్కమంతులగూడెంలో శుక్రవారం మండల ప్రత్యేక అధికారి సంధ్యారాణి పర్యటించారు. ఈ సందర్భంగా బక్కమంతులగూడెంలో అంగన్‌వాడీ కేంద్రంలో ఆమె రికార్డులు తనిఖీ చేశారు. పౌష్టికారంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. అదేవిధంగా చౌటపల్లిలో పారిశుద్ధ్య పనులు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలో రికార్డులు, విద్యార్థుల భోజన మెనూను పరిశీలించారు. ఆయా కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు మౌనిక, కవిత, ఏఎన్ఎంలు నిర్మల, సైదమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు కవిత, పద్మ, జానకి, ఆశాలు మాధవి, కోటేశ్వరి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

స్ప్రే ట్యాంకులు పంపిణీ



బ్యాటరీ పవర్ స్ప్రే ట్యాంకులు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ గిరిబాబు

చిలుకూరు : మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో శుక్రవారం చిలుకూరు, బేతవోలు, నారాయణపురం, రామాపురం గ్రామ పంచాయతీ కార్యాలయాలకు ఎంపీడీఓ గిరిబాబు బ్యాటరీ పవర్ స్ప్రే టాంకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడూ దోమల మందు పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఇబ్రహీం, గ్రామ పంచాయతీ కార్యదర్శులు షరీఫ్‌వుద్దీన్, అజ్మతుల్లా, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన జిల్లా సదస్సు కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నాయకులు

నేరేడుచర్ల : మఠంపల్లిలో ఈనెల 30, 31 తేదీల్లో నిర్వహించబోయే తెలంగాణ గిరిజన సంఘం జిల్లా స్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూక్యా పాండునాయక్ కోరారు. శుక్రవారం నేరేడుచర్లలో సదస్సు కరపత్రాన్ని విడుదల చేసి మాట్లాడారు. సదస్సుకు గిరిజనులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మాలోతు బాలునాయక్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కోదమగుండ్ల నగేష్, ప్రజా సంఘాల నాయకులు ఏసు, వెంకటేశ్వర్లు, బుర్రి శ్రీనివాస్, శివ ఉన్నారు.

బీటీ రోడ్డుకు మోక్షమెప్పుడో..

- నిధులు మంజూరై మూడేళ్లు
- పనులు చేపట్టని అధికారులు
- కంకర రోడ్డుపై ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



రామగిరి నుంచి మూసీఒడ్డుతండాకు వెళ్లే కంకర రోడ్డు

నేరేడుచర్ల : మండలంలోని రామగిరి నుంచి మూసీఒడ్డుతండా వరకు గల కంకర రోడ్డు ప్రమాదకరంగా ఉంది. ఇది సుమారు 3 కిలో మీటర్లు ఉంటుంది. కంకర తేలి ఉండడంతో ఈ రోడ్డుపై విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకలతో దుమ్ముధూళితో అనారోగ్యం పాలవుతున్నారు. బీటీ రోడ్డు కాకపోవడంతో గ్రామాల్లోకి వాహనాలు రాక ప్రజలు, విద్యార్థులు కాలినడకనే ఇతర గ్రామాలకు వెళ్తున్నారు. కంకర తెలిన రోడ్డుపై రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పడి గాయాల పాలవుతున్నారు. వరి కోతల సమయంలో ధాన్యం లోడుతో తరలించేందుకు రైతులు తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. ముఖ్యంగా మూసీ ఒడ్డుతండా, బావోజీతండా, రామకృష్ణ తండాల ప్రజలు నిత్యం వివిధ పనుల నిమిత్తం నేరేడుచర్ల, మిర్యాలగూడకు ఈ రోడ్డుపై వెళ్తుంటారు. వీరికి తిప్పలు తప్పడం లేదు.

నిధులొచ్చి మూడేళ్లైనా..

కాగా, ఎన్నికల సమయంలో వివిధ పార్టీల నాయకులు రామగిరి, మూసీఒడ్డుతండా రోడ్డును బీటీ రోడ్డుగా మారుస్తామని హామీ ఇచ్చారని కానీ ఆచరణలో మాత్రం అమలు చేయడంలేదని తండావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఈ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరై మూడేళ్లు అవుతోంది. కానీ నేటివరకు అధికారులు పనులు ప్రారంభించలేదు. దీంతో ప్రజలు నిరాశలో ఉన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి యుద్ధప్రతిపాదికన బీటీ రోడ్డును నిర్మించాలని కోరుతున్నారు.

త్వరితగతిన బీటీ రోడ్డు నిర్మించాలి



రామగిరి – మూసీఒడ్డుతండా రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ఇబ్బందిగా ఉంది. బీటీ రోడ్డు లేక గ్రామానికి ఎలాంటి వాహనాలు రాకపోవడంతో తండావాసులు కాలినకడన వెళ్లాల్సి వస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులు త్వరితగతిన చేపట్టాలి.

– రమావత్ సైదా, జగన్నాథతండా

త్వరలో పనులు ప్రారంభిస్తాం

రామగిరి నుంచి మూసీఒడ్డుతండా వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తాం. టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది. రోడ్డు పనులను వెంటనే చేపట్టి ప్రజల ఇబ్బందులు తొలగిస్తాం.

– మధుబాబు, పీఆర్ ఏఈ, నేరేడుచర్ల

అంకెల గారడీగా రాష్ట్ర బడ్జెట్



రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

హుజూర్‌నగర్ : రాష్ట్ర బడ్జెట్ పూర్తిగా అంకెల గారడీ మాత్రమేనని బీజేపీ జిల్లా నాయకులు బాల వెంకటేశ్వర్లు, గుండెబోయిన వీరబాబు అన్నారు. బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ప్రధాన రహదారిపై వారు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్‌తో పేదవాడికి న్యాయం జరిగే అవకాశం లేకుండా పోయిందన్నారు. బడ్జెట్‌లో ఫసల్ బీమా యోజన, రైతు బీమా, వ్యవసాయ సబ్సిడీలు, వ్యవసాయ అనుబంధ రంగాలకు సబ్సిడీ ఏవని ప్రశ్నించారు. ఇది రైతుల తలరాత మార్చే బడ్జెట్ కాదని రైతులను నట్టేటా ముంచే బడ్జెట్ అని దుయ్యబట్టారు. రైతు కూలీలు, కౌలు రైతుల సంక్షేమానికి ఎక్కడా కేటాయింపులు లేవన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అంబళ్ల నరేష్, కె.వెంకటేశ్వర్లు, డి.రామరాజు, శేషగిరిరావు, కె.కోటిరెడ్డి, కె.శ్రీనివాస్, కె.లింగరాజు, జె.శ్రీనివాస్, జి.గోపి, కె.నాగరాజు, బల్వంత్‌సింగ్, విజయ్, కె.రమేష్, నరసింహారెడ్డి, శివ, వీరయ్య, హరీష్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేపట్టాలి

నడిగూడెం : ఎస్సీలను ఏబీసీడీలుగా వర్గీకరణ చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బాణాల అబ్రహం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆగస్టు 9న దేశ రాజధానిలో నిర్వహించబోయే మాదిగల మహాధర్నా కరపత్రాలు, వాల్ పోస్టర్లను శుక్రవారం ఆయన నడిగూడెంలో ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు బండారు గుర్వయ్య, నాయకులు బండారు హుస్సేన్, బండారు రాంబాబు, గోపాలదాసు సందీప్ పాల్గొన్నారు.

28న బీసీ హక్కుల కౌన్సిల్ సమావేశం

నేరేడుచర్ల : హైదరాబాద్‌లో ఈనెల 28వ తేదీన నిర్వహించబోయే బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధనుంజయనాయుడు కోరారు. శుక్రవారం నేరేడుచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీ జన గణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం కులాల వారిగా ఎంత శాతం ఉన్నారో తెలపాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, రాజకీయ రిజర్వేషన్లు కూడా అంతే శాతం ఇవ్వాలన్నారు. సీపీఐ నేరేడుచర్ల, మఠంపల్లి మండలాల కార్యదర్శులు సింహాద్రి, అమరారపు పున్నయ్య, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను ఉన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

నేరేడుచర్ల : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ముదిరాజ్‌లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ వారు శుక్రవారం నేరేడుచర్లలో తహసీల్దార్ సురిగి సైదులుకు వినతిపత్రం అందజేశారు. ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలని, మత్స్య పారిశ్రామిక సొసైటీ ఏర్పాటు చేసి రూ.వేయి కోట్లు మంజూరు చేయాలని, ప్రతి ముదిరాజ్‌కు 75 శాతం సబ్సిడీపై రుణాలు అందించాలని వినతి పత్రంలో కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పేరబోయిన వీరయ్య, మండల అధ్యక్షుడు శ్రీకాంత్, దిర్శించర్ల చెరువు సొసైటీ చైర్మన్ నాగరాజు, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీను, రామారావు, చంద్రయ్య, వెంకటేశ్వర్లు, సైదులు, కృష్ణ ఉన్నారు.

చెరువులు, కుంటలు నింపాలి

హుజూర్‌నగర్‌రూరల్ : సాగర్ నీటితో చెరువులు, కుంటలు, బావులు నింపాలని సీపీఐ మండల కన్వీనర్ కందుల వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హుజూర్‌నగర్ మండలంలోని అమరవరంలో ఆ పార్టీ గ్రామ శాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాగర్ ఆయకట్టు పరిధిలో భూగర్భ జలాలు తగ్గి బావులు, చెరువులు, కుంటలు ఎండిపోయాయని తెలిపారు. అడపదడప కురిసిన వర్షాలకు ఏ ఒక్క బావిలోకి నీరు చేరలేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి పగిడిపాటి సైదిరెడ్డి, గుంజ ఉపేందర్, వెంకన్న రామిరెడ్డి, కృష్ణ, సుందరయ్య, రైతులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామపెద్దలు

అనంతగిరి : మండలంలోని వాయిలసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను మాజీ ఎంపీపీ చుండూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగస్తులకు బదిలీలు సహజమని భావితరాలను తీర్చిదిద్దేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ సుంకర వీరమ్మ, వెంపటి వెంకటేశ్వరరావు, కొల్లు స్వప్న, ఉపాధ్యాయులు గంటా రాంబాబు, కే.వెంకటేశ్వర్లు, జానకిరాములు, హుస్సేన్, సునిత, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

అనంతగిరి : మండలంలోని రంగయ్యగూడెం గ్రామానికి చెందిన షేక్ గౌషియా బి.షేక్ హుస్సేన్ బీలకు శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మట్టపల్లి రామకోటయ్య, నాయకులు సయ్యద్ సీరాజ్, షేక్ ఖాసీం రిజ్వీ, సయ్యద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్‌టీయూ లక్ష్యం



చింతకుంట్ల పాఠశాలలో సభ్యత్వాలు నమోదు చేస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

నేరేడుచర్ల : ఉపాధ్యాయుల సంక్షేమమే పీఆర్‌టీయూ లక్ష్యమని ఆ సంఘం మండల అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల మండలం చింతకుంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి రమావత్ దీప్లానాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బట్టు మధు, చందమళ్ల వెంకన్న, కీసర ప్రసాద్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి, కృష్ణారెడ్డి, కోండయ్య, సైదులు తదితరులు ఉన్నారు.

బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న శ్రీనివాస్

నడిగూడెం : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన కుంబజడ శేఖర్ గతకొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మాజీ వార్డు సభ్యుడు వల్లెపు శ్రీనివాస్.. శేఖర్ కుటుంబానికి 25 కిలోల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశారు. ఎస్సీ కాలనీ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కరువు భత్యం మంజూరు చేయాలి



పానుగోడులోని పాఠశాలలో సభ్యత్వాలు నమోదు చేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

గరిడేపల్లి : ఉపాధ్యాయుల పెండింగ్ కరువు భత్యం మంజూరు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మండల సీనియర్ నాయకుడు వెగ్గలం కిషోర్‌బాబు, మండల అధ్యక్షుడు ఎలక సైదిరెడ్డిలు అన్నారు. శుక్రవారం గరిడేపల్లి మండలంలోని కోదండరాంపురం, మల్లయ్యగూడెం, రామచంద్రాపురం, పొనుగోడు, ఎర్రకుంట, గడ్డిపల్లి, కుతుబ్షాపురం, వెలిదండ, రంగాపురం, తాళ్లమల్కాపురం, కీతవారిగూడెం గ్రామాల్లో గల పాఠశాలల్లో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మండల బాధ్యులు రణబోతు ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు జిన్నారెడ్డి వెంకట్‌రెడ్డి, రణబోతు రవీందర్, రేఖ నర్సయ్య, రాము, బాలు పాల్గొన్నారు.

30న 'చలో హైదరాబాద్'

మఠంపల్లి : పంచాయితీ కార్మికుల సర్వీస్‌లను రెగ్యులరైజ్ చేయాలని, పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు మల్టీపర్పస్ విధానాన్ని ఎత్తివేయాలనే డిమాండ్‌తో పంచాయితీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ సంఘం) ఆధ్వర్యంలో జూలై 30న తలపెట్టిన చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను అన్నారు. శుక్రవారం మఠంపల్లిలో జరిగిన ఆ సంఘం సమావేశంలో ఆయన హాజరై మాట్లాడారు. సీఐటీయూ మండల కన్వీనర్ సయ్యద్ రన్‌మియా, పంచాయితీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు భూక్యా సైదానాయక్, మండల కార్యదర్శి బత్తుల వీరస్వామి, అంజయ్య, గురువారెడ్డి, బాలశౌరి, దేవదానం, మైసయ్య, భిక్షం, కోటేశ్వరరావు, నాగలక్ష్మి ఉన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా బడ్జెట్

మోతె : రైతు సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర బడ్జెట్ ఉందని రాష్ట్ర కిసాన్ సెల్ కో–ఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసుదన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మోతె మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్ పట్ల యావత్ తెలంగాణ ప్రజానికం సంతోషంగా ఉన్నారని తెలిపారు. వ్యవసాయ రంగానికి 72,659 కోట్లు కేటాయించడం ఆనందకర విషయమన్నారు.

ఘనంగా శాకంబరీ ఉత్సవాలు

భానుపురి : పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం శాకంబరీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. వాసవీ మాతను కూరగాయలతో అలంకరించారు. దేవాలయంలోని నాగేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వాసవీ మాతకు ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు సామూహికంగా విష్ణు సహస్రనామ పారాయణం, లలితా సహస్రనామ పారాయణం, వాసవీ మాత పారాయణం నిర్వహించారు. భక్తులు పాల్గొన్నారు.

భారత సైనికుల త్యాగాలు చిరస్మరణీయం



కోదాడరూరల్ : గోపయ్యచారి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఐవీఓ సభ్యులు

కోదాడరూరల్ : దేశం కోసం ప్రాణాలు అర్పించిన సైనికుల త్యాగాలు చిరస్మరణీయమని ఇండియన్ వెటరన్స్ ఆర్గనైజేషన్ (ఐవీఓ) రాష్ట్ర కోఆర్డినేటర్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుండా మధుసూదన్‌రావు అన్నారు. కార్గిల్ విజయ దివస్ సందర్భంగా కోదాడడ పట్టణంలోని కార్గిల్ యుద్ధవీరుడు గోపయ్యచారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ సరిహద్దుల్లో సైనికులు ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహించడం వలనే ప్రజలు సంతోషంగా ఉంటున్నారన్నారు. నేటి యువత సైనికులను ఆదర్శంగా తీసుకొని దేశం కోసం సేవ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గుండపునేని నాగేశ్వరరావు, శేకు రమేష్, సత్యనారాయణ, సురేష్ ఉన్నారు.

కార్గిల్ అమరవీరులకు ఘన నివాళి



నేరేడుచర్ల : కార్గిల్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న వాసవీ, వనితా క్లబ్‌ల సభ్యులు

నేరేడుచర్ల : కార్గిల్ విజయ దివస్‌ను పురస్కరించుకొని శుక్రవారం నేరేడుచర్లలో వాసవీ, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో కార్గిల్ అమరవీరులకు, కల్నల్ సంతోష్‌బాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్‌ల జోన్ చైర్మన్ కొత్త లక్ష్మణ్, అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు, భువనగిరి అంజయ్య, గుండా సత్యనారాయణ, ఉప్పల పుల్లయ్య, నటరాజ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఉప్పల కృపాకర్, గోపాల కృష్ణ తదితరులు ఉన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి అన్యాయం



ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కోదాడరూరల్ : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం రూ.21.292 కోట్లు మాత్రమే కేటాయించడం అన్యాయమని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి ఎం.చందర్‌రావు అన్నారు. విద్యారంగానికి తక్కువ బడ్జెట్ కేటాయించడాన్ని నిరసిస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం కోదాడలోని రంగా థియేటర్ సెంటర్‌లో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ సమావేశాల్లో పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజ్ రియింబర్స్‌మెంట్‌పై ప్రస్తావన లేదని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హాస్టల్స్‌కు, గురుకులాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. బడ్జెట్‌లో కేటాయించిన 7.31 శాతం నిధులతో విద్యా వ్యవస్థ మెరుగు పడదని 30 శాతం నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యాసంస్థలను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు విజయ్, ఉదయ్‌కిరణ్, సంతోష్, అనిల్, గణేష్, రాఖీ ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



హుజూర్‌నగర్‌లో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి



హుజూర్‌నగర్‌రూరల్ : వేపలసింగారంలో పరిసరాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

హుజూర్‌నగర్ : ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం డ్రై డేలో భాగంగా హుజూర్‌నగర్ పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య పనులను, తెమిపాస్ మందు పిచికారీని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, హెల్త్ అసిస్టెంట్ ఇందిరాల రామకృష్ణ, జవాన్‌లు, ఆశా కార్యకర్తలు, ఆర్పీలు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

హుజూర్‌నగర్‌రూరల్ : ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ గిరిబాబు అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారంలో నిర్వహించిన డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వర్షాల నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆయన వెంట కార్యదర్శి గిరిజాకుమారి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సిరిపురంలో 'ఫ్రైడే– డ్రైడే'

నడిగూడెం : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ ఎస్‌డీ.ఇమామ్ కోరారు. శుక్రవారం నడిగూడెం మండలంలోని సిరిపురంలో నిర్వహించిన ఫ్రైడే– డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి ఇంటింటికి వెళ్లి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంపల్లి సతీష్‌కుమార్, సిరిపురం పల్లె దవాఖానా వైద్యాధికారి శ్రావణి, ఏఎన్ఎం విజయకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఇందిరా మహిళ శక్తి'ని సద్వినియోగం చేసుకోవాలి

నేరేడుచర్ల : మహిళల ఆర్థిక స్వాలంబన కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరా మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్ అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల మున్సిపల్ కార్యాలయంలో ఇందిరా మహిళ శక్తి పథకంపై మెప్మా సిబ్బందికి నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో పేదరిక నిర్మూలన కోసం చేపట్టిన ఈ పథకంతో ఉపాధి పొందాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అలక సరితాసైదిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి, ఇన్‌చార్జ్ మెప్మా పీడీ కాసం రేణుక ఉన్నారు.

పేద ఆర్యవైశ్యుడికి స్వర్ణభారతీ ట్రస్ట్ ఆధ్వర్యంలో అంత్యక్రియలు



అంత్యక్రియల్లో పాల్గొన్న స్వర్ణభారతీ ట్రస్ట్ సభ్యులు

కోదాడ రూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని తమ్మరకు చెందిన పేద ఆర్యవైశ్యుడు తూములూరి వంశీకృష్ణ అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. కోదాడ ప్రభుత్వ వైద్యశాలలో ఉన్న ఆయన మృతదేహాన్ని తీసుకెళ్లి అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబసభ్యులు రాకపోవడంతో స్వర్ణభారతీ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు, దూరపు బంధువులు, స్నేహితులు ముందుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని ప్రమీల, స్వర్ణభారతీ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు గాదంశెట్టి శ్రీనివాసరావు, ఇరుకుళ్ల చెన్నకేశవరావు, యాధా సుధాకర్, రాయపూడి వెంకటనారాయణ, కనగాల వెంకటరామయ్య, నూనె సులోచన, కనగాల నారాయణ, అక్కిరాజు యశ్వంత్ తదితరులు ఉన్నారు.

సభ్యులంతా తరలిరావాలి

మఠంపల్లి : సూర్యాపేటలో ఈనెల 28న నిర్వహించబోయే గీతపనివారల సంఘం జిల్లా కమిటీ సమావేశానికి సభ్యులంతా హాజరై జయప్రదం చేయాలని సంఘం అధ్యక్షుడు కొండా కోటయ్య కోరారు. శుక్రవారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. సమావేశంలో గీత పనివారలకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాలపై విస్తృతంగా చర్చ, సంఘం బలోపేతానికి తీర్మాణాలు ఆమోదించడం జరుగుతుందని ఆయన తెలిపారు. సంఘం జిల్లా నాయకులు పాలకూరి బాబు, మండల సీపీఐ కార్యదర్శి అమరారపు పున్నయ్య, సీపీఐ సీనియర్ నాయకులు దాశరథి రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

పల్లె ప్రకృతి వనాలపై పట్టింపేదీ!



గడ్డి, పిచ్చి మొక్కలతో రెడ్లకుంట పల్లె ప్రకృతి వనం

కోదాడరూరల్ : ప్రజాప్రతినిధులు లేకపోకపోవడంతో గ్రామాల్లో సమస్యలను పట్టించుకునే నాథుడే లేకుండాపోయారని ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందుకు నిదర్శనమే కోదాడ మండలంలోని రెడ్లకుంట పల్లె ప్రకృతి వనం నిర్వహణ. గ్రామంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఉండడంతో పాటు అడవుల శాతాన్ని పెంచాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రెడ్లకుంటలో పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసింది. నాటి సర్పంచ్ వనం చుట్టూ ఎక్కడాల లేని విధంగా ఐరన్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించి పలు రకాల పండ్ల మొక్కలు, పూలు, అలంకరణ, ఔషధ, కలపనిచ్చే మొక్కలు నాటించారు. అవి ఏపుగా పెరిగి ఆహ్లాదకరంగా మారాయి. అయితే ప్రజాప్రతినిధులు పదవిలో ఉన్నంత వరకు ప్రకృతి వనంలో కలుపు, పిచ్చి మొక్కలు లేకుండా శుభ్రంగా ఉండేది. నాటి జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆ పీపీవీని సందర్శించి అన్ని గ్రామాల్లో అధికారులు రెడ్లకుంటను ఆదర్శంగా తీసుకోవాలని సూచనలు కూడా చేశారు. కానీ ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలనలో రెడ్లకుంట పల్లె ప్రకృతి వనాన్ని ఎవరూ పట్టించుకోకపోవడంతో గడ్డి, కలుపుతో అడవిలా మారి కళ తప్పిందని గ్రామస్తులు అంటున్నారు. అధికారులు స్పందించి పీపీవీని శుభ్రం చేయించాలని కోరుతున్నారు.